### 7.2.2 అభ్యుదయ కవిత్వం

అభ్యుదయ కవిత్వం రెండు దశాబ్దాల పాటు (1935–55) సాహిత్య రంగాన్ని సంపన్నం చేసింది. సాహిత్యం ఒక భోగవస్తువు కాదని, ప్రజలను సారస్వతోన్ముఖులుగా జేయటానికి అభ్యుదయ రచయితలు విప్లవాత్మక పరిణామాలను సాహిత్యంలో తీసుకురావటానికి ప్రయత్నించారు. ధనిక సమాజం పోవాలని రచనలు చేయటమే అభ్యుదయ రచన.

1930లో ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడి దేశ పరిస్థితులు, ప్రజా జీవనం, విలువలు తారుమారయ్యాయి. నూతన ఉద్యమాలు మొదలయ్యాయి. ఇటలీలో ఫ్యూచరిజం, బ్రిటన్‌లో సర్రియలిజం, ఫ్రాన్స్‌లో డాడాయిజం శక్తివంతమైన ఉద్యమాలుగా బయలుదేరాయి. ఫ్రాన్స్‌లో కళాసంబంధమైన ఉద్యమాల్లో పేర్కొనదగింది క్యూబిజం, సింబాలిజం, ఇంప్రెషనిజం. ఈ కాలంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, విజ్ఞాన, సాహిత్య రంగాలలో చెప్పరానంత మేరకు మార్పులు చోటు చేసుకున్నాయి.

1930–40 మధ్యకాలంలో శ్రీశ్రీ, శిష్ట్లా, నారాయణబాబు, పఠాభి వంటి కవులు ఛందస్సుని తిరస్కరించి, సరికొత్త ప్రయోగాలు చేసి, నవ్యతను సాధించారు.

ఆంధ్ర సాహిత్యలోకాన్ని ఉత్తేజితం చేసినఅభ్యుదయ కవిత్వోద్యమ మూలవిరాట్టు శ్రీశ్రీ. వ్యక్తి చైతన్యంతోపాటు సంఘ చైతన్యాన్ని ప్రవచించాడు. శ్రీశ్రీ గేయాల్లో అధికభాగం మార్క్సిజాన్ని గర్భీకరించుకున్న రచనలే. కొన్ని మౌలిక సత్యాలయిన వ్యక్తి చైతన్యం, సామాజిక చైతన్యం, ప్రకృతికి, మానవుడికి సంబంధించిన సత్యాలు కూడ ఇతని రచనల్లో గర్భితమయి ఉన్నాయి.

> "మరో ప్రపంచం,
> మరో ప్రపంచం,
> మరో ప్రపంచం పిలిచింది !" [1] – మహాప్రస్థానం

---

1. శ్రీశ్రీ, మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 15వ కూర్పు, నవంబరు, 1975. పుట 17.

"ప్రపంచమును పరిహాసిస్తాం,
భవిష్యమును పరిపాలిస్తాం"[1] – అద్వైతం

శ్రమ శక్తి దోపిడీకి గురయ్యానని నిలదీసి తిరుగుబాటు గొంతుతో ప్రశ్నించాడు ఈ తిరుగుబాటు ద్వారానే రాజకీయ ఆర్థిక విధానాలలో మార్పు వచ్చి, సామ్యవాదానికి మార్గం ఏర్పడుతుంది.

"నే నొక్కణ్ణీ నిల్చిపోతే
చంద్ర గాడ్పులు, వానమబ్బులు, మంచుసొనలు
భూమి మీదాభుగ్నమౌతాయి
పగళ్ళన్నీ పగిలిపోయీ
నిశీథాలూ విశీర్ణిల్లీ
మహాప్రళయం జగం నిండా
ప్రగల్భిస్తుంది". – జయభేరి

"నే నొకణ్ణీ ధాత్రి నిండా నిండిపోయీ
నా కుహూరుత శీకరాలే
లోకమంతా జల్లులాడే
ఆ ముహూర్తాలాగ మిస్తాయి."[2] – జయభేరి

అందరూ శ్రమజీవులే అయితే శ్రామికజాతి కంతటికి వసంతకాలం వస్తుందని కోకిలగా మారి కుహూరుత శీకరాలు కురిపిస్తానని, ఆ ముహూర్తకాలం ఆగమిస్తుందని, భవిష్యత్ సూచనను ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు.

---

1,2 శ్రీశ్రీ, మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 15వ కూర్పు, నవంబరు, 1975. పేజి 71, 21.



విశ్వసృష్టి మొదలు తన పాత్రే ప్రధానంగా ఉన్నప్పటికీ, తనకు అస్తిత్వం అన్నది లేకుండా చేసిన సమాజంపై తిరుగుబాటు గొంతుతో ప్రశ్నించి, తానే విజృంభిస్తే మహాప్రళయం వస్తుందని, తీవ్ర స్వరంతో చాటుతున్నారు.

భాషా విప్లవం, భావ విప్లవం అడుగడుగునా తొంగిచూసే అభ్యుదయ కవిత్వంలో ప్రయోగించిన పదాలకు ప్రత్యేకత ఉంది. ఎండకాలం మండిపోవడం కోపానికి, వానకాలం ముసిరిపోవడం దరిద్రానికి, దండయాత్రలో శీతకాలం కోలుబెట్టడం దౌర్జన్యాలకి సూచ్యార్థాలు.

జగన్నాథుని రథచక్రాలు భవిష్యత్ కవిత్వానికి విప్లవానికి ప్రతీకలుగా కనిపిస్తాయి. ఇది మరోప్రపంచానికి ప్రతీకగా కొన్నిచోట్ల ధ్వనిస్తుంది. ఆ రథచక్రాలు కార్మికులు, శ్రామికులు. రథచక్రాలు నాలుగు వర్ణాల సమసమాజానికి ప్రతీక. పుడమి తల్లికి పురుటి నొప్పులు కొత్త సృష్టిని స్ఫురించాయి. సామాన్య మానవుడు ధనస్వామ్య వ్యవస్థ మీద తిరుగుబాటు చేసి, జయభేరిని మ్రోగిస్తాడు. భూత వర్తమాన భవిష్యత్ కాలాలలో ఈ ప్రపంచాభ్యుదయానికి తన పాత్రను తెలియజేస్తున్నాడు. ప్రపంచంలో తనకూ ఒక పాత్ర ఉందని, తన అస్థిత్వాన్ని వ్యక్తపరచుకోవటానికే ఈ ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చానని, విశ్వవృష్టికి అశ్రువొక్కటి ధారపోశానని, భువన ఘోషకు వెర్రి గొంతుక విచ్చి మ్రోశానని శ్రామికుడు తరతరాలుగా గుర్తింపులేని తనాన్ని శ్రమ దోపిడీని ఇక్కడ వ్యక్తం చేసారు.

అభ్యుదయ కవులు బాహ్య సంస్కరణతో బాటు అంతరంగ సంస్కరణను కూడా ఆశిస్తున్నారు. ఖడ్గ సృష్టిలో అట్టహాసాలు సంబరాలు తరువాత అందరూ గుర్తించవలసిన విషయం ఏమిటంటే ఆంధ్ర రాష్ట్ర అవతరణ విజయం సామాన్య మానవుడికి చెందుతుంది అని భాషా విప్లవం తెచ్చిన పెద్దలు ఇచ్చిన ఆశీర్వాదాలు

ఆంధ్రావనికి శ్రీరామ రక్షగా నిలుస్తాయి అని, వర్తమానంలో కొనసాగుతున్న భావ, భాషా విప్లవాలు సాహిత్యలోకానికి ప్రపంచానికి శ్రీరామ రక్షగా నిలుస్తుందని, సుదూర భవిష్యత్తు ఉజ్జ్వల భవిష్యత్తుగా రూపొందుతుందని, మార్పు సత్ఫలితాలనిస్తుందని 'దేశంలో దేవత్వం దీపించాల' ని ఆశించారు. రవాణా సౌకర్యాలలో, పరిపాలనలో, వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో నాడు నేడు రేపు పరిణామాలతో కూడుకున్నాయి.

"నిన్నటి మన స్వరూపం స్మరించి
నేటి మన స్వభావం గ్రహించి
రేపటి మన సమాజం కోసం
కలిసి మెలసి శ్రమించుదాం" [1] – ఒకటీ–పది

మంచి చెడులనేవి అన్ని కాలాలకు వర్తిస్తుంది. గతవైభవాన్ని స్మరిస్తూ నేటి దుస్థితికి చింతిస్తూ రేపటి ప్రణాళికలను ఆశిస్తూ భావికాలంలో జాతినంతటినీ ఏక మార్గంలో నడిపించే మహానాయకుడు మనకు లభిస్తాడని, మానవత్వం గుర్తించి మానవులు మహనీయులైననాడు రేపటి ప్రపంచంలో సౌభాగ్యం వెల్లివిరుస్తుందని, ఆదర్శ ప్రపంచాన్ని ఆశించారు శ్రీశ్రీ. ఆయన ఆశించిన సామాజిక పరిణామం ఊహించినంత మేరకు సంభవ నీయమే. సంభవనీయ భవిష్యత్తునే ఆశించారు, కానీ జరగవచ్చు, జరగక పోవచ్చు అనే భవిష్యత్తును ఆశించలేదు. తాననుకున్నది తప్పక జరగుతుందనే విశ్వాసం కనిపిస్తుంది.

"ప్రాహ్లాద కవిత్వం పూర్వ కవిత్వం కాదు. భావ కవిత్వం కాదు, నూతనములో బహు నూతన కవిత్వం"[2] అని శిష్ట్లా ఉమామహేశ్వరరావు

1. ఖడ్గ సృష్టి, శ్రీశ్రీ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు 1988, పుట 7
2. శిష్ట్లా ఉమామహేశ్వరరావు, నవమి చిలుక – మున్నుడి, ప్రథమ ముద్రణ 1938.



భవిష్య సమాజంలో, సాహిత్యంలో మార్పు కోసం ఆరాటపడ్డారు.

"విధాత తిప్పు గానుగలం
మనమే మనకు పీనుగలం
విషాద రసము నీడ్వగలం
కానీ – ఇంకేం చేయగలం"[1] – మృణాళిని

భగవంతుని చేతిలో బ్రతుకు ప్రయాణం కొనసాగుతుందని మన చేతిలో ఏమీ లేదని అంతా విధి లిఖితమనేది కవి దృక్పథం. సంప్రదాయ విశృంఖలత విడినపుడే, పెను నిద్దుర విడినపుడే 'విధివంచితులం, బతుకంతా నాటకమ'నే భావం నుండి స్వేచ్ఛ కలుగుతుంది.

ప్రపంచాభ్యుదయానికి 'ప్రపంచాబ్జపు తెల్లరేకయి, విశ్వవీణకు తంత్రినయి భువన భవనపు బావుటానయి పైకి లేస్తా'నని పీడిత జనం కోసం భవిష్యత్తులో జయభేరి మ్రోగిస్తానని, మరో ప్రపంచాన్ని చూపిస్తానని వాగ్దానం చేసాడు శ్రీశ్రీ. "భవిష్యత్తులో విశ్వాసం లేనివారు, గతంలో విశ్రాంతి తీసుకుంటారు. వెనుకటి కంటె యిప్పుడు మానవజాతి ముందంజ వేసిందనీ ఇక మీద ఇతోధిక వేగంతో పురోగమిస్తుందనీ, నమ్ముతున్న వారిలో నేనొక్కణ్ణి"[2] అని శ్రీశ్రీ భవిష్యప్రపంచం, భవిష్య మానవుడిపై తనకున్న ఆశయాన్ని వ్యక్తం చేసారు. మానవాదర్శాలు నెరవేరే భావి కోసం, సుఖం సౌభాగ్యం నిండిన భవిష్యత్తు కోసం ఈ శాంతిని స్వర్ణాక్షరాలతో లిఖిస్తున్న భవిష్యత్తు కోసం ప్రయాణించాలని ఆశించారు శ్రీశ్రీ.

1. పఠాభి, కల్పన, ఆధునిక కవితా సంపుటి, చేతన సాహితి, విశాలాంధ్ర, ప్రచురణాలయం, తొలి ముద్రణ 1953, పుట 66.
2. కె.వి రమణారెడ్డి, శ్రీశ్రీ సాహిత్యం, మూడు, వచన విభాగం, 1945–1969, శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సంఘం, 1970 పుట 198.

"తడబడ కుండా నడవండి
గమ్యం చేరండి, కాంక్షను సాధించండి
ప్రపంచాన్ని వెలిగించే
పతాకను నిలబెట్టండి" [1] – అరచేతిలో మృత్యువు

గంగినేని వెంకటేశ్వరరావు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని తన అనుభవాలను 'ఉదయిని' అనే విప్లవ కవితా సంకలనంలో వర్ణించారు. మానవతను పరిరక్షించే వ్యవస్థ రావాలని ఉజ్జ్వలమయం చేయమని ప్రబోధిస్తున్నాడు. 'దయాధర్మం ఉరితీసే ఉదయం ఒక్కనాటికైనా వద్దంటాడు' కవి.

ఆస్థానకవి, దాశరథి కవితల్లో భవిష్యత్ భావాలు వ్యక్తమవుతాయి. 'భవిష్యత్తుకు స్వాగతం' అనే కవితలో భవిష్యత్తు ఏ విధంగా ఉండాలో సూచించారు. పూలగుత్తులా, వసంతంలా, నందనవన సుగంధంలా, నవరసమయ ప్రబంధంలా, అలగీత గోవిందంలా, అనురాగ బంధంలా, యువహృదయాలలో నవప్రణయం అంకురింపజేసేలా భవిష్యత్తు రావాలని దాశరథి ప్రవచించారు.

"విరిసిన సౌందర్యార విందంలా
రావాలి భవిష్యత్తు"
"సువర్ణ పతాకాల
ప్రగతి ప్రతీకలా
రావాలి నా భవిష్యత్తు" [2] – భవిష్యత్తుకు స్వాగతం

1. గంగినేని వెంకటేశ్వరరావు, కల్పన, ఆధునిక కవితా సంపుటి, చేతన సాహితి, విశాలాంధ్ర ప్రచురణాలయం, తొలిముద్రణ 1953,పుట 276.
2. దాశరథి, తిమిరంలో సమరం, మహాంధ్ర ప్రచురణలు, మద్రాసు, 1975, పుట46.



భవిష్యత్తు ప్రగతికి ప్రతీకలా ఉండాలని ఆశించారు. దాశరథి భవిష్యత్తు గురించి ఆశాసౌధాన్ని అధిరోహించాలని సూచించారు. మానవుల్లో సమష్టి భావం ఉంటే సురలోకం నిర్మించవచ్చని వ్యక్తపరచారు. వర్తమానపు పునాదుల్లోనే భవిష్యత్తు ఉందని, ఈనాడు ప్రతికూలంగా కనిపించేవి రేపు ఆనుకూలంగా కనిపిస్తాయని వివరించారు.

"భవిష్యత్తు అనగానే
భయపడతారెందుకు ?
వర్తమానపు పునాదుల్లో
భవిష్యత్తు నా సౌధం". [1] – ఆశాసౌధం

దాశరథి 'స్వాప్నికుడు' అనే కవితలో ఆదర్శమయిన భవిష్యత్తును చిత్రించారు. నేటి పరిస్థితి దుర్భరంగా ఉన్నా... రేపటి దినం మీద విశ్వాసంతో ఈ రోజు ఎలా ఉన్నా భరిస్తానని వివరించారు. గొంగళి పురుగులే సీతాకోక చిలకల్లా వికసిస్తాయని, కృత్రిమాల ఉక్కు చట్రం కూలి సత్యం, దయ, శాంతుల ధర్మచక్రం నిత్యం పరిభ్రమిస్తుందని విశ్వసించారు.

"రేపు మీద విశ్వాసం ఉన్న నేను
నేడు ఎలా ఉన్నా భరిస్తాను!" [2] – స్వాప్నికుడు

నిన్నటి చరిత్రే ఈనాటి చరిత్రగా మిగిలింది. బాణాలు, ఫిరంగులు ప్రసక్తి లేని పురాణాలు, చరిత్ర లేదు. ఈనాడు రూపాయిల మోత, తుపాకీలు లేకుండా

1. దాశరథి, దాశరథి కవిత, అమృతాభిషేకం, మహాంధ్ర ప్రచురణలు, మద్రాసు, 1977, పుట 132.
2. దాశరథి, ధ్వజమెత్తిన ప్రజ, యం. శేషాచలం అండ్ కంపెనీ, సెప్టెంబరు, 1981, పుట 14.

గడవదు. రాజులమాట, అణుబాంబుల మాటే గాని రైతు, మనిషి అనే మాట లేదు. 'నిన్నా, ఇవాళా వేర్వేరు అన్న మాట అబద్ధం' మరి ఆగామి మాత్రంవేరని ఆశించటం తప్పా? దాశరథి మాటల్లో

రేపు 'కవి మాటకు విలువ హెచ్చి
కలహం మాట నశిస్తుంది
రూపాయికి విలువలేని
రోజు రేపు వస్తుంది' [1]

రూపాయికి విలువలేని రోజు రేపు వస్తుందట. భవిష్యత్తులో డబ్బుకు విలువుండదని, అణుబాంబుల స్వరాలుండవని, కవి మాటకు విలువ పెరుగుతుందని విశ్వసిస్తున్నారు.

కవి మాటకు విలువ పెరగటం వాస్తవం. కలహం నశించాలనే ఆలోచన, సమైక్యతాదర్శ పునాదులపై రాజ్యాలు నెలకొనే ప్రయత్నమే జరుగుతుంది. అమలుపెట్టే ప్రయత్నాలలోనే దేశం ముందడుగు వేస్తుంది. ప్రస్తుతం డబ్బుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. విసుగెత్తిన జనం విలువ నివ్వకపోవటం సుదూర భవిష్యత్తులో సంభవిస్తుంది.

'రానున్నది' యేది నిజం
అది ఒకటే సోషలిజం

'రేపటి జలపాతాలు'లో మనిషి నేడా? మానవత నేడా? మానవత ఈనాటిదా? నాటివన్నీ నేటికీ ఉన్నాయి. ఆనాటివే ఈనాటివి. భూత వర్తమాన కాలాల్లో తేడా లేదనే విషయాన్ని దాశరథి దృఢంగా పలుకుతున్నారు. రేపు మాత్రం వర్తమాన చట్టాలు, చేతలు పక్కకు తప్పుకుంటాయి.

1. దాశరథి కవిత, దాశరథి, మహేంద్ర ప్రచురణలు, మద్రాసు, 1977, పుట 239.



"రేపు మాత్రం జనం చూచే
చూపులో అజ్ఞానముండదు.
దాస్య ముండదు, దైవ ముండదు
లొంగిపోయే రోగముండదు.
రేపు వేరే రేపు వేరే
రెక్కలూడిన స్వప్న దేవత
పిక్క బలిసిన పేద మనిషి
వొక్కటై లోకాన్ని సాకెడి
రోజు రేపే, రేపు రేపే [1] – రేపటి జలపాతాలు.

స్వప్నాలు విడివడి, పిక్కబలం గల పేదవాడే రేపటి ప్రతినిధి. పేదప్రజలు ఎంగిలి మెతుకులు దొంగిలించి బంగారం పొంగించిన ధనికులను మింగాలని కాలం తొంగి చూస్తుంది. హిట్లర్, ముస్సోలినీలు ఓట్లడిగి ప్రభువులై కోట్లాది పేదల ప్రాణాల్తో ఆట్లాడుతున్నారు. అంతర్జాతీయ దేశాలు గొంతు విచ్చి సమర ధ్వానాలు పూరిస్తున్నారని ప్రజలలో చైతన్యం మేల్కొన్నదని దాశరథి 'అదుగో' కవితలో వర్ణించారు.

స్వాతంత్ర్యానంతర కవి, సి. నారాయణరెడ్డి, 'మార్పు నా తీర్పు' కవితలో భవిష్యత్ భావాల్ని మనం గమనించవచ్చు.

"శిశిరం నుంచి వసంతానికి
చీకటి నుంచి ప్రభాతానికి
నిరాశ నుంచి ఆశాశిఖరానికి
అశ్రు జలధి నుంచి ఆనంద తీరానికి

1. పునర్నవం, దాశరథి, దాశరథి కవిత, మహేంద్ర ప్రచురణలు, మద్రాసు, 1977, పుట 251.

నడిపించే మార్పు
నే నిచ్చే తీర్పు." [1]

మానవుల్లోను, సమాజంలోను మార్పు రావాలని, చైతన్యం కలగాలని సి. నారాయణ రెడ్డి కవితలోని అంతరార్థం. ప్రగతిని తప్పు దారి పట్టించేవారికి మరణ శిక్ష విధించాలని, అదే తన తీర్పని వివరించారు. ఆనందం వెల్లివిరిసే భవిష్యత్తు వసంతంలా రావాలని ఆశించారు.

సి. నారాయణరెడ్డి 'రేపటికోసం' కవితలో నేటి పరిస్థితిని వివరించారు. నేడు నిశ్శబ్దాన్ని గుండె నిండా పీల్చుకొని, నీడని ఒంటి నిండా కప్పుకుంటే రేపు బద్దలయ్యే అగ్ని పర్వతాల రొదల కోసం, ప్రజ్వలించే మండుటెండల కోసం, ఆగవలసి వస్తుంది. రేపటి విప్లవానికి సిద్ధంగా ఉండండని ప్రవచిస్తున్నారు.

వర్ణ వ్యవస్థను విమర్శిస్తూ, పేద ధనిక వర్గాల తారతమ్యాన్ని నిరసిస్తున్నారు. ముష్కరులు, తస్కరులు లేని సత్యలోకం వస్తుందని భవ్యలోక స్వచ్ఛతను ఆశిస్తున్నారు. గతకాలపు మూర్ఖత్వం నశించి ముళ్ళను కూడా మృదువుగా భావితరాల వారు మార్చగలరని, సమాజ ప్రగతికి అవరోధాలుగా నిలిచే వారిని సైతం మార్చగలమనే విశ్వాసం ఉన్న భావిలోకం కనిపిస్తుంది. ఆశాజనక లక్ష్యంతో తేజోలోకం ముందడుగు వేస్తుంది. వర్తమానం భవిష్యత్తుకు దారి చూపిస్తుంది. భావికాల భవితవ్యానికి జోస్యం చెపుతున్నారు ఆరుద్ర –

"ముళ్ళకి మృదుత్వం నేర్పేవాళ్ళు
ముష్కరులూ తస్కరులూ లేనిలోకం
ముందడుగు వేస్తూ వస్తోంది! మూర్ఖుడా! చావు!." [2] – జోస్యం

1. డా. సి. నారాయణ రెడ్డి, మార్పు నా తీర్పు, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, డిసెంబరు, 1974, పుట 2.
2. ఏటి కేడాది, కవితా సంకలనం, ఆరుద్ర, 1979.



"బతుకంతా దండిగా నిండగ
ముందున్నది హలాల పండుగ
దండిగ మన బతుకులు నిండుగ
ముందున్నది కలాల పండగ
కవిత కురిసి
పదం పండి
బతుకంతా దండిగ నిండగ
ముందున్నది కలాల పండగ
ముందున్నది కలాల పండగ
ముందున్నది." [1] – ముందున్నది

ఆశావాది ఆరుద్ర. మారుతున్న కాలంతోబాటు మారుతున్న విలువలున్న సమాజం అయినా ఆరుద్ర కవితల్లో ఆశ అంతరించలేదు. సుఖం కురుస్తుందని, శుభం పండుతుందని, కవిత కురిసి పదం పండి, కలాల పండుగ ముందున్నదని భావిని సూచిస్తున్నారు. వర్తమానమే కలాల పండుగ. జరుగుతున్న దానినే భవిష్యత్తులో మరింత అధికంగా ఉంటుందని ఆశిస్తున్నారు. వర్తమానం భవిష్యత్తులోకి దారితీస్తుందని సూచిస్తున్నారు.

"నేడు ఎంత కురుపుగా ఉందో
రేపు అంత పువ్వుగా ఉంటుంది !
అందుకే
జీవించడం నిజంగా మంచి !...
రేపు ఇంకా పుట్టని పాప
అయినా బ్రతకడం బాగేనా ? [1] – రేపు

1. కవితలు–విపుల సంకలనం, ఆరుద్ర రచన, క్వాలిటీ పబ్లిషర్స్, 1985, పుట 56.
1. కవితలు–విపుల సంకలనం, ఆరుద్ర రచన, క్వాలిటీ పబ్లిషర్స్, 1985,పుట 112.

ఓపెన్ ఫైర్, పిలుపు కవితల్లో తెలంగాణ విమోచనోద్యమం కోసం రచించిన కవితలు నూతన సాంఘిక వ్యవస్థ నిర్మాణానికి నవయుగ నిర్మాణానికి, మహోజ్జ్వల చరిత్ర రచనకి కదలి రమ్మని పిలుపునిస్తున్నారు.

ఎందులోంచి ఎప్పుడు ఎలాగ పుట్టిందీ కాలం అని కాల స్పృహతో కవిత్వం రాసినవారు ఆరుద్ర. కాలం ఒక తేలని ప్రశ్న, తీరని తృష్ణ అని అంటారు.

"రానున్న కాలంలోనే రానున్న కాలంలోనే
జరిగిపోయిన జరుగుతున్న కాలాలున్నవి" [1] – ఆవాహన

భవిష్యత్తులోనే భూత వర్తమాన కాలాలున్నాయని విలక్షణంగా వర్ణిస్తూ కాలంపై మానవుడి అధికారాన్ని సూచిస్తున్నారు. భూతకాలాన్ని గడ్డకట్టేట్టు చేస్తానని, రానున్న కాలంలోని 'విష ఘడియల గుండియ'లను విజ్ఞానశాస్త్రాలలో తుత్తునియలు చేసి ప్రమాదాలనుండి తప్పిస్తానని, వర్ధమాన కాలంలో కష్టాలు లేకుండా చేస్తానని కాలాన్ని బానిసగా చేస్తానని దృఢ విశ్వాసంతో వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం సాగుతున్న కాలంలో తెలంగాణ విప్లవం గురించి అది సాధించబోతున్న విజయాలను గురించి వివరిస్తూ గతం రాతిదిబ్బ, గతానికిక భవిష్యత్తు అతుకబోదు అని భవిష్యత్తులో ప్రజలు భూస్వామికి వ్యతిరేకంగా తిరగబడి స్వాతంత్ర్యం సాధిస్తారని ఆశించారు.

---

1. ఆరుద్ర, త్వమేవాహమ్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1981, పుట 3.



"తీరాలు సరిహద్దులు
చెరిపేసిన నవలోకం
చెడుపులేని నవలోకం
శ్రామిక సామ్రాజ్యమగును
శ్రామికులే సామ్రాట్టులు" [1] – త్వమేవాహం

పీడితులు తుఫాను బిడ్డలు. పీడితుల హృదయంలో, జీవితంలో పెను తుఫాను ఏర్పడినా మునుముందుకు సాగి భవిష్య యుగగర్భంలో నూతన జీవితజ్యోతుల వెలుగుకై వేచి ఉన్నారు. భవిష్యత్తు నావకు చుక్కాని వీరి చేతిలోనే ఉందంటున్నారు ఆలూరి బైరాగి.

"ఎవరు వారు ! ఎవరు వారు !
ఈ తుఫాను హోరులోన
చావు బ్రతుకు పోరులోన
వెనుదిరగక మునుముందుకు
దీక్షతోడ సాగువారు !
ఈ భీషణ ధ్వంసలీల
లో నూతన వసంతాల
అంకురాలు చూచువారు !" [2] – పెనుతుఫాను

భూతకాలాన్ని నెమరు వేస్తే లాభం లేదు. భావికాలంలో భూతకాల గాథలు వ్యర్థ గాథలవుతాయి. భవిష్యత్తులో అవి చెరిగిపోయే గాథలవుతాయి. ఆశాజనకంగా కొనసాగిన కవిత. భవిష్యత్తును భయంకరంగా ఊహించకుండా

---

1. ఆరుద్ర, త్వమేవాహం, 1981, పుట 80.
2. చీకటి నీడలు, ఆలూరి బైరాగి, ఏ.బి.సి.ప్రచురణలు, హైదరాబాదు, 1978, పుట 12.

వేకువ మెలకువతో వెలుగులో పయనాన్ని ఆశయాన్ని సూచించారు కవి ఆవంత్స సోమసుందర్.

"వర్ధమాన లోకంలో వ్యర్థగాథలై తీరును.
భవిష్యత్తు వెలుగుల్లో చెరిగిన వెతలైపోవును" [1]. – సమధర్మం

ఇంతకాలం నోరులేక పడిఉన్న ప్రజల మనస్సు తాడితమై విజృంభించి వెంటాడే స్థితిని వ్యంజ్యమానం చేసే పంక్తులు సోమసుందర్ కవితాత్మను ప్రఫుల్లం చేసేవి. "వృద్ధ జగతి సమాధిపై సమధర్మం ప్రభవింపజేసే ఆశారూపానికి క్రియా శక్తిగా విప్లవం రూపొందింది. చరిత్రగతిలో వచ్చిన పరివర్తన వేగంతో సంఘర్షణ పర్యవసానంగా నిమ్నోన్నతాలు నశించి, పరాధీనత్వం, పురాలోకం, కృతకృత్వం వక్రగతి స్థానంలో స్వాధీనత్వం, నవలోకం, సహజత్వం, ఋజుగత అవతరించి క్రమంగా అవనిపై 'నిన్న నేడుల కృషియే రేపై జన్మించుతుంది' సమధర్మం ప్రభవిస్తుందన్న ఆశాకేతనం ఆవిష్కృతమైంది.

ఆలోచన రూపంలో వికసించిన అభ్యుదయ భావనస్ఫుటంగా ప్రతీతమయ్యే లయాత్మక పద విన్యాసంతో చీకటి నుండి ఉదయమై భవిష్యత్తు వెలుగుతూ రూపొందిన క్రాంతిచిత్రం "సమధర్మం" [2].

అవినీతి ప్రబలిన లోకం విముక్తి పొందాలని కోరుకుంటున్నాడు కవి. విషపూరిత లోకానికి నూరేళ్ళు నిండింది. పాపపు లోకపు నిండుకుండ రేపో ఎల్లుండో బద్దలవక మానదు, బద్దలయి తీరుతుంది. పొగరుమోతు లోకం కూలిపోక మానదు.

"రేపో ఎల్లుండో
కూలిపోక మానదు." [3] – బాడుగ గోడీలు

1,3. వజ్రాయుధం, ఆవంత్స సోమసుందర్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, చతుర్ధ ముద్రణ, 1986, పుట 7, 36.

2. వజ్రాయుధం – ఒక సమాలోచనం, మాదిరాజు రంగారావు, పుట 84.



అయితే నూరేళ్ళు నిండిన ఈ లోకం చావక తప్పదు. పాపం పండిన ఈ లోకపు నెత్తి మీద నిండుకుండ రేపో ఎల్లుండో ఛళ్ళున బద్దలవక మానదు. కవి ఆశించిన ఆశయాలు సమీప భవిష్యత్తులో సంభవనీయతను సూచిస్తుంది. ఈ లోకం వినాశనానికి దారి తీస్తుందనే నైరాశ్య భావాన్ని కవి వ్యక్తం చేస్తున్నాడు.

"ఒక వీరుడు మరణిస్తే
వేల కొలది ప్రభవింతురు !
ఒక నెత్తుటి బొట్టులోనే
ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు" [1] – బానిసల దండయాత్ర

తెలంగాణ పోరాటంలో నైజాం పాలనలో రాక్షసత్వం నాశనమై, శ్రమజీవులు ఏకమై, ప్రజా కోటి పోరాటం సలుపుతుందని ప్రజాశక్తిని ఏ గన్లూ ఫిరంగులూ అపలేవని, విశాలాంధ్ర ప్రజాస్వామ్యం అమరుతుందని 1949లోనే తెలంగాణ విముక్తికై సోమసుందర్ గళమెత్తి చాటారు.

"ఇరవై ఒకటో శతాబ్ది వచ్చి
నీ నిశాంత దేహళిలో నిలిచింది
ఆప్యాయంగా తలుపుతట్టి పిలిచింది
లే! ఎందుకాలస్యం చేస్తావింకా?" [2] – ఆగామి శతాబ్దం ఆహ్వానిస్తోంది.

అజ్ఞాన తిమిరంలో జీవజలం వ్యర్థమైపోయింది. అలసత్వమే బలహీనతకు కారణం. చైతన్యాలనన్నిటిని సమీకరించి మనస్సులను కేంద్రీకరించి

1. వజ్రాయుధం, ఆవంత్స సోమసుందర్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, చతుర్ధ ముద్రణ, 1986, పుట 48.

2. ఒక్క కొండలో వేయి శిల్పాలు, ఆవంత్స సోమసుందర్, కళాకేళి ప్రచురణ, పిఠాపురం,1984, పుట 100.

వసంతాగమనానికి ఆహ్వానం పలకాలి. ఆయుధ ప్రయోగాలతో సమన్వయం సాధించలేమని, ప్రభుత్వాలు ధనవర్గరథ తురంగాలయ్యాయని, ఆగామి శతాబ్దం కోటి శంఖనాదాలొలికిస్తే వస్తుందని ఆవంత్స సోమసుందర్ తెలియజేసారు. సకల విలాపాలకూ సమాప్తి పలికే ఉజ్జ్వల రేఖ భవిష్యత్తు.

ఈ లోకం తనంత తానుగా మారుతుందనేది దురావగాహన. భూతకాలం కన్నీళ్ళతో తన చరిత్రను రాసుకుంది. ఇకనైనా జైత్రయాత్ర సాగించి సాధించాలి. నిర్జీవ పదార్థమైన ఇసుకను మరిగించి, కరిగించి అందచందాలుచిందే గాజు పాత్రల్ని తయారుచేసినట్టుగా శప్తులై పడి ఉన్న సజీవమానవులను జీవకాంతులతో మెరిసేట్టుగా చేయాలి. శ్రమైక జీవుల సంకెళ్ళు విడదీయాలి. ప్రపంచాన్ని పునర్నిర్మించాల్సిన ప్రతిభా సూర్యులకా ఈ దుర్వ్యవస్థ? ఆగామి శతాబ్దం ఆహ్వానిస్తోంది. విజృంభించి సందేశమందుకో, సమధర్మ సుదర్శనం అవతలిగట్టుపై నిరీక్షిస్తోంది. మహత్తర మానవ విజయాలు సాధిద్దామని మేల్కొల్పి ఆగామి కోసం కవి నిరీక్షిస్తున్నాడు.

ఆగామి కోసం ఉదయిస్తున్నాడు పదమూడో సూర్యుడు. ద్వాదశ సూర్యులను మన వాఙ్మయం పేర్కొన్నది. సమాజ అయోమయపు చక్రాల్ని, ప్రభుత్వం అమానుష చట్టాల్ని పదమూడో సూర్యుడు పెకిల్లుమని పేలుస్తాడు. నిన్నటి చరిత్ర ఒక దరిద్రాంగన అసురసంధ్యగా నిలిచింది. భూత కాలంలో ఎవరో పన్నిన పాపాల సాలె గూళ్ళలో ప్రజలు మక్షి కాలయ్యారు. ఈ సూర్యుడు కీడుల్ని మ్రోడుల్ని చేటుల్ని రేపే ప్రక్షాళిస్తాడు. మాటల్లో మధురం హృదయంలో విషం చిందిస్తున్నాడు నేటి మానవుడు. 'కాంతి రేఖలు పొడమవేల దివసమున? అని ముఖారి రాగంలో పాడుకుంటాడు. ఈప్సితాలను, దుర్వాంఛల్ని కాపాడుకుంటాడు.



"కాని – రేపటి సూర్యుడు పదమూడోవాడు
చీకట్లను కట్లను పరపర కోసుకుంటూ ఉదయిస్తాడు
అప్పుడిక తప్పదు, మారిపోతుంది లోకం –
రేపటి మానవుణ్ణి అసహాయశూరుణ్ణి
ఆహ్వానిస్తోంది కాలం చకోరాక్షి" [1] – ఆగామి సూర్యోదయం

గతకాల మానవుడు నిర్మించిన సంప్రదాయపు కట్టుబాట్లను నేటి మానవుడు మనసులో దాచుకున్న చీకట్లను ఛేదిస్తూ ఆగామి సూర్యోదయం గత వర్తమాన కాల సూర్యోదయాలకన్న భిన్నంగా ఉంటుందని ఆశిస్తున్నారు. సమాజంలో బాహ్య పరిణామంతో బాటు ఆంతరంగ పరిణామం కూడ అవసరమని తెలియజేస్తున్నారు.

నయాగరా కావ్య కవులు బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కుందుర్తి ఆంజనేయులు. గతకాలపు సమాజం వీరికి శవ సామ్రాజ్యంగా కనిపించింది. కుందుర్తి 'నాలోని నాదాలు' అనే ఆత్మాశ్రయ కవితలో కాలాన్ని గురించి, కవిత్వాన్ని గురించి, జీవితాన్ని గురించి తనకున్న అభిప్రాయాలను వెల్లడించారు. 'యుగశక్తి ప్రభావానికి ఎప్పుడో ఒకప్పుడు కొద్దో గొప్పో లోనుగాక తప్పదు. ఈ కాల ప్రభావాంశ కవిత్వంలో ఎంత మోతాదులో వున్నదనే ప్రమాణంతోనే అభ్యుదయ కవులనీ, తద్భిన్నులనీ – కవులను గూర్చి అనుకుంటున్నాం. ఇది ప్రధానంగా స్పష్టంగా కనిపించేటంత వున్నవాడు అభ్యుదయ వాది. ఇది బైటికి కనిపించనంతగా, యితర లక్షణాలకు ప్రాధాన్యం వున్న సందర్భంలో సంప్రదాయవాది అవుతున్నాడు'.

---

1. ఆగతానికి శుభారంభం, సోమసుందర్, కళాకేళి ప్రచురణలు, పిఠాపురం, పుట 113.

"కష్టాల వర్తమానంలో గడిపే వారు గడవండి
ఆనందపు ఆగామి మీద ఆశవుంటే నాతోరండి". [1] – నాలోని నాదాలు

'కాళరాత్రి గర్భం నుండి దూసుకు పడిన ఉషశ్శిశువు తొలి వెలుగు రేఖల మూలుగు వినిపించింది ఆత్మజ్ఞాన కిరణ మార్గం కనిపించింది' ఉజ్జ్వల భవిష్యత్తు కనిపించింది.

కొత్త వ్యవస్థ వస్తుందని ఆ వ్యవస్థలో అందరికీ అవకాశాలూ, సరిపోయే వస్తూత్పత్తి పంపిణీలో సమానత్వం ఉంటుందని, వర్ణ వివక్షలేని సమాజం రూపొందుతుందని, సంఘానికి కొత్త స్వరూపం వస్తుందని కుందుర్తి ఆంజనేయులు సామ్యవాదవ్యవస్థను ఆశించారు.

"ఒక జాతికి నెత్తిన కళ్లూ
మరోవర్గపు మహావమానం
పొడ చూపని ఏదో వ్యవస్థ
సంఘానికి కొత్త స్వరూపం
వస్తుందట" [2] – తరువాత

బానిసత్వ విచ్ఛేదక శక్తిగా, అన్నపూర్ణ స్వర్ణపాత్రగా, వర్గ పోరాట శక్తిగా, వక్రగాములైన చరిత్ర, రాజనీతి ప్రజాపథానికి నడిచే శక్తిగా ప్రజాశక్తి వస్తున్నదని, ప్రజలే ప్రజాశక్తిగా నిలిచి అరి భయంకర ఆహవశక్తియై, నవ జీవన ప్రభాత భేరియై, అభాగామినియై, నరులనందరిని నడిపించే విప్లవకర మహాశక్తిగా,

1. కుందుర్తి, కుందుర్తి పీఠికలు, స్పందన సాహితీ సమాఖ్య, మచిలీపట్టణం, ప్రచురణ పదహారు, 1977, పుట 102.
2. నయాగరా, కుందుర్తి ఆంజనేయులు, ఫ్రీవర్స్ ఫ్రంట్, హైదరాబాదు, 1975, పుట 56.



జీవశక్తిగా, నిలిచి భవిష్యత్తును తీర్చి దిద్దుతుందని, మార్పిజం దానికి ఆధారమని పిడికిలి బిగించి గర్జిస్తున్నారు ఏల్చూరి సుబ్రహ్మణ్యం. [1]

ఏల్చూరి సుబ్రహ్మణ్యం 'నాకే వృద్ధాప్యం వస్తే' కవితలో
"జ్ఞానాంతపు జడతకు యాత్రిస్తే
నిజం నాకు తెలుస్తుంది ప్రపంచమిక మారుతుంది
జర, బడలిక గుర్తించని బ్రతుకు తీరు తెలుస్తుంది" [2]
– నాకే వృద్ధాప్యం వస్తే

అని వృద్ధాప్యం వస్తే ఒంటరిగా అడుగుపడదు, కన్నులు చూడవు. ప్రపంచంలో మార్పు రావాలంటే ఆలోచన అవసరం. జ్ఞానమున్నవాడు యథార్థాన్ని గుర్తిస్తాడు. యధార్థం గుర్తెరిగిన వానికి ముసలితనం, విరామంలేని బతుకు విలువ తెలుస్తుంది.

ఆగామి జనయుగ అపూర్వభాషణ వినబడదు అని నిర్జీవమై ఉన్నప్పటికి ప్రపంచం మారుతుందని, వార్థక్యం గుర్తించని బ్రతుకు తీరు తెలుస్తుందంటారు.

పడిపోయిన ఒక ఇటుకను నీ చేతులతో, చేతలతో సరిచెయ్యి ఫలితాన్ని ఆశించకుండా కష్టిస్తే నవధరిత్రిని సృష్టించవచ్చంటారు ఏల్చూరి. వార్థక్యం వచ్చిన వ్యక్తికి ఇక రేపు రాదని ఆ వ్యక్తి భావాలను చేతలతో అనుసరించి నిలబెట్టవచ్చని సూచించారు.

'పరిత్యాగి పరివేదన'లో నగర జీవితాలలో పట్టపగలే నక్షత్రాలు కనిపిస్తాయి. ఇంద్ర ధనుస్సుల సౌందర్యం అసత్యాల అరణ్యం వర్తమానం. తత్ఫలితంగా వినాశనాన్ని స్వహస్తాలతో తెచ్చుకున్నానంటారు అజంతా. అయినా

1. నయాగరా, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, ఫ్రీవర్స్ ఫ్రంట్, హైదరాబాదు, 1975, పుట 67.
2. తరంతరం, సంపాదకుడు కుందుర్తి, 1976, పుట 45.

మనిషి ఎప్పటి కయినా తప్పు తెలుసుకుంటాడని ఒక ఆశ. భావకవుల అవాస్తవిక ప్రపంచాన్ని విమర్శిస్తూ అది అసత్యాల అరణ్యమని భవిష్యత్తు లేదని అ విషయాన్ని ఏనాడైనా గ్రహిస్తారనే ఆశతో జీవిస్తున్నానని తెలియజేసారు. కాల స్పృహ కన్నా కవులను దృష్టిలో పెట్టుకుని రచించిన కవిత ఇది.

"స్వహస్తాలతో నిర్మించుకున్న కంటక చతురస్రాన్ని
పడగొట్టడం సర్వకల్ల – ఇక జీవితం నిండా శూన్యం" [1]

తెలుగు వచన కవితా ప్రక్రియలో రసవాదాన్ని ప్రవేశ పెట్టి ఉద్యమాన్ని కొత్తదారి పట్టించిన నవ్యకవులలో ఎల్లోరా ఒకరు. అక్షరాలలో అగ్నిని రగిల్చిన కవి. వీరి కవితలలో సహనం, అణకువ, పౌరుషం వంటి గుణాల ప్రబోధం కనిపిస్తుంది. 'సంకుచితమైన జాతిమతాల సరిహద్దుల్ని చెరిపేసే మహాయజ్ఞంలో ఋత్విక్కులం మనం, అకుంఠితమైన మానవీయ పతాకను ఎగురవేస్తున్నాను చూడు'[2] అని జాతిమత సరిహద్దుల నిర్మూలనని కోరుకున్నారు ఎల్లోరా.

"వెళ్ళి పోతున్న కాలరేఖలు
విడుస్తున్న రేపటి ఆశలతో
వర్తమాన సౌధా నిర్మాణాలకి
బ్లూప్రింటు సిద్ధంచేసే
భవిష్యత్ బ్రహ్మలైన
యువకుల గుండెని
వాయిస్తున్న విప్లవ
తరంగాల ధ్వనిలో
క్రాంతి దర్శనం చేస్తున్నాను!"[3]

1. తరంతరం, సంపాదకుడు కుందుర్తి, వందమంది కవుల అభ్యుదయ కవితాసంకలనం, ఫ్రీవర్స్ ఫ్రంట్, హైదరాబాదు, 1976, పుట 14.
2. ఎల్లోరా, మరోసూర్యోదయం, దీప్తి పబ్లికేషన్స్, 1985, పుట 27
3. ఎల్లోరా, జ్వాలా తోరణాలు, దీప్తి పబ్లికేషన్స్, హైదరాబాదు, 1981, పుట 87.



భూత భవిష్యత్ వర్తమాన కాలాలకు ఉన్న సంబంధాన్ని తెలియజేస్తూ గతించిన కాలం ఆశలతో వర్తమానానికి దారి చూపి భావి యువకులకు క్రాంతి దర్శనం చేస్తుంది. వర్తమాన కాల రేఖలపై నిలబడి భూతకాలంలో తొంగి చూసి రేపటి క్రాంతి సందర్శనానికి సత్య దర్శనం అవసరమని భావించి భవిష్యత్ న్యాయ దుర్గంపై వణకుతున్న నిజాలను చెప్పిస్తానంటున్నారు ఎల్లోరా.

పంజరంలోని పక్షి బ్రతుకు అనుభవమే గతకాలం. స్వేచ్ఛగా ఎగిరిపోతున్న పక్షి అనుభవం ఈనాటిది. స్వాతంత్ర్యానంతరం భవిష్యత్తు ఆనందంగా వెల్లివిరుస్తుందని భావిస్తున్నారు ఎల్లోరా.

"జీవితాన్ని అనుభవాల నగిషీతో చెక్కిన మనిషి
చెమటతో తడిసి భవిష్యత్
పుష్పాలు నవ్వుతున్నాయి" [1] – ఆశాచంద్రశాల

'నేడు ఇంత శ్రమపడి నిర్మించుకొన్న ఆశాచంద్రశాలలో కాలం కరిగి వెన్నెలయింది' అనే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు ఎల్లోరా. ప్రగతి కోసం భవిష్యత్తు కోసం పొదుపు అవసరమని (నిస్వార్థ స్వార్థం పుట 54), జీవితం బంగారుబాట కావాలంటే మంచి మార్గంలో పయనించాలని సూచనలిచ్చారు. నేలను సస్యశ్యామలం చేయాలని (సూరీడు బొట్టుగా పుట 59), అంటూ దేశాన్ని చూసినపుడు మనస్సు చివుక్కుమంటుంది. అందుకే శత సహస్ర జ్వాలాముఖులమై పోదాం మానవ మహోదయానికి అని రేపటి ఉదయానికి ప్రయాణం చాలా దగ్గరలో ఉందని అంటారు'.[2]

1. కుందుర్తి, కుందుర్తి పీఠికలు, స్పందన సాహితీ సమాఖ్య, మచిలీపట్టణం, ప్రచురణ పదహారు, 1977, పుట 102.
1. అగ్ని కిరీటావిష్కరణం, ఎల్లోరా, అగ్నిపుష్పం, దీప్తి పబ్లికేషన్స్, హైదరాబాదు, 1990, పుట 63.

ఎల్లోరా దృక్పథంలో భూతకాలం పంజరంలా, వర్తమానం స్వేచ్ఛలా, భవిష్యత్తు పువ్వుల నవ్వులా కనిపించింది. జీవితానుభవం నేర్పే పాఠాలు భవిష్యత్తును నందనవనంగా మారుస్తుందని సగటు మానవుడి భవిష్యత్తు ఎలా ఉండాలని కోరుకుంటాడో ఆ కోణంలో ఆలోచించి భవిష్యత్తుకు పొదుపు అవసరమని సూచించారు. జాతిమత సరిహద్దుల్ని తుడిచి వేయాలని ఆ ఉదయం దగ్గరలోనే ఉందంటారు.

గతమంతా నాస్తి, వెలిబూది అనే తత్త్వం కాదు భీమన్నది. ప్రతి అంశాన్ని తర్కబద్ధంగా, హేతువాద దృక్పథంతో పరిశీలించటం వారి నైజం. 'విత్తనాల మడి' అనే కవితలో బోయి భీమన్న కాల స్వభావాన్ని వర్ణించారు.

"కాల ప్రవాహంలో
ప్రతిక్షణమూ ఒక అల
అది లేచి పడడమే వర్తమానం"
"కాల గర్భంలో గతం ఎలా ప్రసుప్తమో
భవిష్యత్తూ అలానే ప్రసుప్తం" [1] – విత్తనాల మడి

వర్తమానం గతాన్ని నిద్ర పుచ్చుతుందని భవిష్యత్తును లేపుకుంటూపోతుంది విరామం లేకుండా అని భూత భవిష్యత్తు వర్తమాన కాలాలు అనేవి విత్తనాల మడి వంటివి. గతమూ బీజమే భవిష్యత్తు బీజమేనని తార్కిక పద్ధతిలో నిరూపించారు. తమసులో దాగి భవిష్యత్తుకి గాని వర్తమానం గాని కనిపించదంతే కాని విశ్వంలో లేనిది కాదు అని అంటారు బోయి భీమన్న.

భూత, వర్తమాన, భవిష్యత్కాలాలను గురించి కాళోజి నారాయణరావు

1. బోయి భీమన్న, గుడిసెలు కాలిపోతున్నాయ్, స్వీయ ప్రచురణ, 1977, పుట 65.



"ఈ చీకటి ఉండదు
సూర్యుడు తప్పక ఉదయిస్తాడు
ఆ వెలుతురు నిలవదు
సూర్యుడు మళ్ళీ అస్తమిస్తాడు" – పునరావృత్తి

అని మూడు కాలాలు సూర్యోదయాస్తమయాల్లా కొనసాగిపోతాయని శక్తినిబట్టి సాక్షాత్క రిస్తుందని వర్ణించారు.

"హరిహరుడై మానవుడే అవనిని కాపాడవలెను"[1] అని కాళోజి నారాయణరావు మానవుడు దినదినం చేసే ప్రయోగాల నుండి ఈ ప్రపంచాన్ని మానవుడే కాపాడు గలుగుతాడని, అణుశక్తిని ఆదుకునే అవకాశం హరిహరులకు కూడ లేదని, మానవుడే హరిహరుడై ప్రపంచాన్ని కాపాడాలని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

బాపురెడ్డి కవితల్లోను మనం భవిష్యత్ భావాల్ని గమనించవచ్చు. బాపురెడ్డి 'భవిష్యద్దర్శనం'లో భావ భౌతిక వాదాన్ని వ్యక్తపరిచారు. మానవుడు ప్రపంచంలోని పరిణామాన్ని వీక్షించబోతున్నాడని, మానవుని జిజ్ఞాస పెరిగి సృష్టి రహస్యాల్ని తెలుసుకుంటాడని ఉన్నత భవిష్యత్తుని భావించారు. భవిష్యత్ మానవుడికి తిండి గుడ్డలు అల్పవిషయాలుగా కనిపిస్తాయి. ఇరవై ఒకటో శతాబ్దంలోని మనిషి మహానుభావుడని చిత్రించారు.

"కాలాన్ని తొడుకున్నాడు మనిషి. కత్తిరించి కుట్లువేసి తనకు అనుకూలంగా పృథివిని తిప్పుకున్నాడు మనిషి"అని అంటారు సి.నారాయణరెడ్డి.

1. కాళోజి, నా గొడవ – 5, పరాభవ హేమంతం, ప్రథమ ముద్రణ 1966, పుట 33.

"అదిగో ఇరువది యొక శతాబ్ద
మ్మందు మనిషి మహానుభావుడ !
చూడు మాతని బ్రతుకు ఎంతటి
సుందరమ్మో, ప్రచలితమ్మో !" [1]

బాపురెడ్డి కవితలో జగత్పరిణామం సంభవించునన్న సిద్ధాంతం ప్రతిబింబిస్తుంది.

ఎంతటి ఒడిదుడుకులనైనా సరే తట్టుకొని, కష్టాలకు ఎదురొడ్డి నిలిచే పెనుతుఫాను బిడ్డలు నేటి శిశువులు. రేపు నాది అనే మంత్రపు శక్తితో నవ జీవిత విజయానికి సాగిరమ్మని ప్రోత్సాహిస్తున్నారు శివారెడ్డి.

గతాన్ని ద్వేషించకుండా, ఆరాధించకుండా దాని నుండి గుణపాఠాన్ని నేర్చు కోవాలంటారు శివారెడ్డి. నిన్నలో చతికిల బడ్డవానికి వర్తమానం కురచగా కనిపిస్తుంది, భవిష్యత్తు అయోమయంగా మారుతుంది. నిన్నలో కూరుకు పోయినవానికి రేపులో నిలబడ్డ వాడెలా అందుతాడని ప్రశ్నించారు శివారెడ్డి.

'మనిషి బతుక్కి అర్థం సమూహంలోనే ఉంద'నే శివారెడ్డి తన పరిమితులకు లోబడి ఉద్యమాలతో ఉన్న సంబంధాల పరిమితులకు లోబడినా శక్త్యానుసారం సమాజ పరంగా గాఢంగా తనను తాను వ్యక్తీకరించుకోవటానికి చేసే ప్రయత్నమే తన కవిత్వమని ప్రకటించారు.

'గతాన్ని ఆరాధించను, ద్వేషించను కాని గుణపాఠాన్ని నేర్చుకుంటాను' అని అంటారు. గతంలో పాదాలు, వర్తమానంలో రొమ్ము, భవిష్యత్తులో చూపులు రూపుదిద్దుకుంటున్నాయి అని మూడు కాలాలను స్పృశించారు.

---

1. జె. బాపురెడ్డి, బాపురెడ్డి గేయాలు, సుఖేలా ప్రచురణ, హైద్రాబాదు, 1974, పుట 16.



'రేపును
సమతా కాంతి లోకంగా తీర్చిదిద్దడం
సమగ్ర ఆర్థిక స్వాతంత్ర్యం సాధించటం
నిజం మాట్లాడితే
రేపును దీపంగా వెలిగించటం
నాకెంతో ఎంతో ఇష్టం' [1] – గతం నీది భవిష్యత్తు నాది.

సమగ్ర ఆర్థికస్వాతంత్ర్యం సాధించి సమతా కాంతిలోకంగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నారు. 'జీవితాన్ని సూత్రీకరించకు' అనే కవితలో గతం దిగులు గది, ఆ గదిలో చింతల రామకోటి, కార్యాచరణ శూన్యులై వీరోచితంగా పోరాడే శక్తి లేని వాళ్ళు, భవిష్యత్తును ఆహ్వానించలేని వాళ్ళు. గతంలో ఏమీ లేదు అంతా భవిష్యత్తులోనే ఉందంటారు శివారెడ్డి.

పొలాల జలాల కోసం ఆలోచించు, హలాల ఫలాల కోసం ఆలోచించు, కోటి నిరుద్యోగాలతో, శతకోటి నైరాశ్యాలతో, అనంత కోటి దరిద్రాలతో కిటకిటలాడిపోతుంది వర్తమానం. విసుగు లేకుండా పని చెయ్యటమే దీనికి పరిష్కారం అని మార్గాన్ని నిర్దేశిస్తున్నాడు మిరియాల రామకృష్ణ. శ్రమైక జీవనానికి మించినది లేదని ఆ పునాదులపై ఆధారపడిన జీవనం సుగమనమవుతుందని అది సుదూరంలోనే ఉందనే భావాన్ని వ్యక్తం చేసాడు.

"భూతకాల వికృత భయద ...
ఒక్కపురాయుగ చిహ్నం ...
ఇంకెంతో సేపుండదు

---

1. శివారెడ్డి, రక్తం సూర్యుడు, ఝరీ పోయిట్రి సర్కిల్, 1991, పుట 12.

ఒక్క నవోజ్జ్వల జగత్తు
ఉదయించే వేళయింది !
ఒక భవ్యసమాజ సృష్టి
కావాహన జరుగుతోంది" [1] – తూరుపు

గజ్జల మల్లారెడ్డి సనాతనంగా మార్పులేని సమాజం. ఇకమునుపు మారుతుందని నూతన సమాజ సృష్టి జరుగుతుందని కవి ఆశిస్తున్నారే గాని అది ఏ రూపంలో ఏ పద్ధతిలో కొనసాగాలనే దృష్టికోణం కనిపించదు.

నార్ల వెంకటేశ్వరరావు 'జగన్నాటకం' (గీతాలు, గేయాలు)లో 'చిత్తము చిగురొత్తునులే, సత్యము పురి విప్పునులే, చీకటి తెర తొలగునులే, నవశకము విరియునులే' నని నవోదయాన్ని కాంక్షించారు. 'సోషలిజం వేదసూక్తమై చెల్లబోతున్నది' అని మంచిరోజులు చూడబోతున్నామని ఆశించారు. నార్ల వెంకటేశ్వరరావు పురాణాలలో కలియుగ సూచనలుగా చెప్పబడిన దేవతామూర్తుల ఉగ్రరూపం ప్రళయ సూచనలు కావు ప్రజాయుగ ప్రాదుర్భావ మంటారు.

"విలయం కాదిది, నవ జీవన
చలనం
ప్రళయం కాదిది, ప్రజాయుగ
ప్రాదుర్భావం" [2] – నవభారతం

'కోట్ల సంవత్సరాల వెనుక అరణ్యాల మధ్య గర్జించిన పురాతన కిరాతుడు నా గుండె గుహలో నిలబడి అరుస్తున్నాడు' [3] – జీవజ్వాల

1. మఖ్దూం కవిత, గజ్జల మల్లారెడ్డి, మూలం–మశరిక్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1990 పుట 57.
2. నార్ల వెంకటేశ్వరరావు, జగన్నాటకం, మద్రాసు, పుట 129.
3. అద్దేపల్లి రామమోహనరావు, సంపాదకుడు : కుందుర్తి, తరంతరం, వందమంది కవుల అభ్యుదయ కవితా సంకలనం, పుట 16.



ప్రళయకాల రుద్రుడవై అభాగ్యులకై, అనాథలకై పరిగెత్తమంటున్నారు అద్దేపల్లి రామమోహనరావు.

పత్రికలలో రోజూ చదివే వార్తలే చర్విత చర్వణమవుతుంది. అవే అక్షరాలు అవే పదాలు అవే పాదాలు. వాటినన్నింటిని శిక్షించాలని కసిగా ఉందంటారు కవి. వర్తమానం అంతా మసిగా ఉంది, ఏమీ మార్పు లేదు. పత్రికారంగంలో మార్పేమీ రావటంలేదు. వర్తమానానికి అంతమే లేదు. వర్తమానం దాటితేగదా భవిష్యత్తు చిగురించటానికి? దానికి పరిష్కారం అంతరంగంలో మార్పురావాలి. అది భవిష్యత్తుకు పునాది కావాలి అని అంటున్నారు నాగభైరవ కోటేశ్వరరావు.

"అంతరంగం మారితే
ఆర్తగీతం ముగుస్తుందిః
వర్తమానం దాటితే
భవిష్యత్తు చిగురిస్తుంది." [1]

కొత్త పేజీలో ప్రతి అక్షరం ఒక డైనమైట్, ప్రతి పదం ఒక మెషిన్‌గన్, ప్రతి పాదం విప్లవ గీతం, ప్రతి నాదం ప్రగతి వేదం కావాలని అప్పుడే సమానత్వం తప్పక వస్తుందనే ఆశాభావంతో ప్రజలు జీవిస్తున్నారు.

మిరియాల రామకృష్ణ 'నామకరణం' కవితలో 'రేపో ఎల్లుండో సౌభ్రాత్ర ఉదయిస్తాడు, మూఢ విశ్వాసాల మీసాలు లాగుతాడు' అని భవిష్యత్తును ఉదయించబోయే బిడ్డగా ఊహించి సంభవీనయ భవిష్యత్తును ఆశించారు.

"ఒక విత్తనం ఊడల మర్రిచెట్టును సృష్టించవచ్చు.!
ఒక ప్రస్తుతం ఉజ్జ్వల భవిష్యత్తును చూపించవచ్చు !
నేటి పునాది రేపటి అంతస్తుకు రూపం కల్పించవచ్చు"! [2]
– రేపటి పండగ

1. నా ఉదయం, కవితా సంకలనం, నాగ భైరవ కోటేశ్వరరావు, కాట్రగడ్డ అభిమాన ప్రచురణ, పెదపాడు, 1983, పుట 55
2. విద్య ద్వీణలూ వెన్నెల తీగలూ, మిరియాల రామకృష్ణ, సామ్యవాద సాహితీ, 1981, పుట 83.

పిందెల ఆకారాన్ని బట్టి పళ్ళ అవతారాలుంటాయి. వర్తమానాన్ని అనుసరించే భవిష్యత్తు ఉంటుంది అనే దృఢ విశ్వాసం కనిపిస్తుంది. భవిష్యత్తు అనేది ప్రత్యేకంగా ఉండదు, వర్తమానమే ప్రధానం. అది భవిష్యత్తుకు దారి తీస్తుందనే విశ్వాసం కొందరి రచయితలలో కనిపిస్తుంది.

భవిష్యత్తును ఎవరు సూచించగలరు? ఈ నాడిలా జరుగుతుందని నిన్న అనుకున్నామా? మార్పు అనేది కొనసాగిపోతూ ఉంటుంది. 'మార్గాల మార్పులు లేనిదే కాలంతో మనం వెళ్ళలేం'. స్వప్నజ్వాలలు సృష్టించే కల్పనాలోక వివశుల్లి, జాతీయ భావాల పునాదుల్లో టైంబాంబులు దాచే విధ్వంసకాభిలాషులను దరి చేరనీయక ప్రతి మనస్సు, ప్రతి శ్రవణం, ప్రతిగళం, ప్రతి కలం ఈ వేళ 'మానవతాకాశం మీద కామమొయిళ్ళను గెంటడానికి ప్రయత్నిస్తుంది.

"ఇదే దారిలో ఇంకొంచెం హుషారుగా
హుటాహుటిగా హుందాగా
ఇరవై ఏళ్ళలో తరలిపోయి చేరుతాం –
ఆ సుఖ సువర్ణ సుందర సుదూర సీమ" [1]
"అనంత కాలానికి కానుకలుగా మారేదాకా
విశ్రాంతి తీసుకో వద్దంటున్నది" [2] – వర్తమానం సవాల్..

ఎన్. వెంకట రంగారెడ్డి 'వర్తమాన గీతం'లో వర్తమానానికే ప్రాధాన్యమిచ్చారు. ఈనాటి బీజమే రేపు ఫలాల నందిస్తుందని రాబోయే భవిష్యత్తు ఒక కల, ఆశయాల వల. ఆ ఆశల ఆశయాల నీడలలో నేడు మనిషి సతమతమవుతూ బ్రతుకుతున్నాడు. ఇటు భూతకాలం అటు భవిష్యత్తుపై గాక వర్తమానంలో జీవించమంటారు వెంకట రంగారెడ్డి.

1, 2 విద్య ద్వీణలూ వెన్నెల తీగలూ, మిరియాల రామకృష్ణ, సామ్యవాద సాహితీ, 1981, పుట 86, 115.



"వర్తమానం కాలం రేపు యిచ్చే
ఫలాల బీజం
కట్టుకునే ఆశా సౌధాల పునాది
రాబోతున్నది భవిష్యత్తు
అంతులేని కల
వింత ఆశయాల వల
వీటితో సతమతమయ్యే జీవితాలు
"కాలం" వేసే పందిరి నీడలు" [1] – వర్తమాన గీతం

గతాన్ని నెమరువేయక గాలిలో మేడలు కట్టక వర్తమానాన్ని తీర్చిదిద్దుకో మంటున్నారు.

'భవిష్యత్తు నుంచి ఒక లేఖ'లో వర్తమాన భవిష్యత్తులను సూచించే పద్ధతి కొంత భిన్నంగా కనిపిస్తుంది. స్పర్శకే సంప్రదాయ సంగీత శృతులు గతి తప్పాయి. వర్తమాన సమాజంలో త్వరితగతిలో పొందే పరిణామాలు, చరిత్ర గమనాన్ని శాసించే సామాజిక విరుద్ధ శక్తులు భూత కాలంగా మారి కవి భూత భవిష్యత్కాలాలకు తాను వంతెనై నిరంతర ఉద్రేకంతో తిరుగుబాటులా జీవిస్తానని నాగభూషణం భూత వర్తమాన, భవిష్యత్‌కాలాలను వర్ణించారు. వర్తమానం సంఘర్షణలతోనూ, భవిష్యత్కాలం తిరుగు బాటుతోనూ జీవితం కొనసాగిపోతుందని జరుగుతున్న వర్తమానమే భూతకాల చరిత్రగా మిగిలిపోతుందని అంటున్నారు. విప్లవ ప్రస్థానం భవిష్య మానవ ప్రగతి ప్రస్థానానికి బాటలు వేస్తుందని ఆకాంక్షించారు.

1. సంపాదకుడు, కుందుర్తి, తరంతరం, ఫ్రీవర్స్ ఫ్రంట్, హైదరాబాదు, 1976, పుట 40.

"నాకాన కట్ట కట్టి
మనుష్య మనో ఊసర క్షేత్రాలకి
నన్ను మళ్ళించండి !
వాటిని అనురాగ ప్లావితం చేసి
ప్రేమ బీజాలను
అంకురింపజేస్తాను" [1] – భవిష్యత్ నుంచి ఒక లేఖ

బాహ్య సంస్కరణల వల్ల మాత్రమే సమాజం మారిపోతుందనుకుంటే అది పొరపాటేఅవుతుంది. ఆంతరంగికంగా ప్రేమబీజాలు అంకురింపజేయాలి. ఆ ప్రేమ అంకురం అనేది పుట్టుక ఆరంభంలోనుండే మొలకెత్తాలి.

స్వాతంత్ర్యానంతర కవి సుప్రసన్నాచార్యుల కవితల్లో కూడ భవిష్యత్ భావం వ్యక్తమవుతుంది. జగత్పరిణామ క్రమంలో మానవుడు పరివర్తన చెందుతాడని వివరించారు. మానవుడు చైతన్యవంతుడైనపుడు ఉన్నత సిద్ధిని పొందేందుకు ప్రయత్నిస్తాడన్న భావాన్ని వ్యక్తపరుస్తూ ఎదురు చూసే ఆ వేళ తప్పక వస్తుందని భావించారు.

"పొరలు పొరలు క్రమంగా తొలగిపోయి
స్వచ్ఛమైన సూర్య కిరణంలా సాగిపోయేవు నీవు –
అనంతత్వ ద్వారాలు భళ్లున తెరుచుకొనే వేళ
మనస్సుకూ, విశ్వచేతనకూ మళ్ళీ ముడిపడే వేళ
అచింత్య సౌందర్య జ్వాలా తోరణ వెలిగే వేళ
ఎదురుచూచే ఆ వేళ – తప్పక సాక్షాత్కరిస్తుంది." [2] – ఆ వేళ

1. స్వేచ్ఛ కోసం కవితలు, వ్యాసాలు, నాగభూషణం, మనస్విని ప్రచురణలు, హైదరాబాదు, 1990, పుట 56.
2. సం. కోవెల సంపత్కుమారాచార్యులు, చేతనావర్తం, వచన కవితా సంకలనం 2, 25 ఆగస్టు, 1970, పుట 102.



'ఆ వేళ' కవితలో సుప్రసన్నాచార్యుల భవిష్యత్ భావాలు శ్రీ అరవిందుల భవిష్యత్ భావాలేనని చెప్పవచ్చు. 'పాండిచ్చేరి గీతాలు'లో భవిష్యత్తును దర్శించారు. శ్రీ అరవిందుల పరిణామ సిద్ధాంతాన్నే వీరు తమ కవితల్లో విశదీకరించారు. శ్రీ అరవిందులు భవిష్యత్తుని దర్శించిన కోణంలోనే సుప్రసన్నాచార్యులు కూడ భవిష్యత్తుని దర్శించారని చెప్పవచ్చు. మానవుల్లోను, ప్రకృతిలోను పరిణామం సంభవిస్తుందని, పురోగతి ఉంటుందని వివరించారు.

"జడ వస్తువులలో చైతన్య పరీమళం
ప్రతి కదలిక పురోగతి – మన ఉద్గతి
ప్రతి భావన క్రొత్త శ్రుతుల అన్వేషణ" [1]
"ఇక్కడ అందరూ వ్యక్తులు కారు ప్రతీకలు
రాబోయే సమిష్టి చేతనా యుగానికి వార్తికాలు" [2]

తన కవితలో ప్రతి భావన కొత్త అన్వేషణ అని, రాబోయే యుగం చేతనా యుగమని వివరించారు. వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యంగా మారి జగత్పరిణామానికి దారితీస్తుంది. అప్పుడు విశ్వచేతన కలిగినపుడు అది చేతనాయుగమే అవుతుంది.

ఎస్వీ సత్యనారాయణ భవిష్యత్తులో మార్క్సిజం జ్వాలగా మండుతుందని, ఆక్రందనగా వినబడుతుందని, డైనమైట్‌లా పేలుతుందని అదే భవిష్యత్తని అంటారు.[3]

అభ్యుదయ కవుల దృక్పథంలో కాలస్పృహ పలు విధాలుగా కనిపిస్తుంది. భవిష్యత్తు వెలుగులో వర్తమానం చెరిగిపోతుందని, మార్పు రావాలని,

1 & 2 డా. సుప్రసన్న, పాండిచ్చేరి గీతాలు, శ్రీ అరవింద కేంద్రము, 24, ఏప్రిల్,1975, పుట 5.
3. ఎస్వీ సత్యనారాయణ, జీవజ్వాల, ఎస్వీ సంస్కృతీ సమాఖ్య, హైదరాబాదు, 1985, పుట 14.

పురోగమించాలని, సత్యలోకం వస్తుందని శ్రీశ్రీ, ఆరుద్ర, శిష్ట్లా, ఆవంత్స సోమసుందర్ ప్రబోధించారు.

భూత కాలం బద్ధలవుతుందని, ఫెనుతుఫాను వంటిదని పంజరం వంటిదని, అసత్యాల అరణ్యం భగవంతుని చేతిలో బ్రతుకు విధి అని పేర్కొన్నారు. వర్తమానం భవిష్యత్తుకు దారి తీస్తుందని విశ్వసించినవారు కాళోజి, ఆరుద్ర, బోయి భీమన్న, ఎస్. వెంకటరంగారెడ్డి.

కొంచెం నమ్మకమిస్తే కొండలు పిండి చేస్తానని ఆలూరి, సోషలిజమే వేద సూక్తమని నార్ల, అన్ని కాలాలను బానిసగా చేస్తానని ఆరుద్ర, చేతులతో చేతలతో నిలబెట్టమని ఏల్చూరి తమ దృక్పథాలను వెల్లడించారు. కార్యాచరణ మూలంగా భవిష్యత్తును, సహజంగా ఏర్పడే భవిష్యత్తును, మార్పువలన ఏర్పడే భవిష్యత్తును అభ్యుదయ కవులు ఆశించారు.

వర్తమాన కాలంలో నిలిచి వర్తమానాన్ని, భవిష్యత్తును విశ్లేషించటం కష్టం. వర్తమానంలోనే అంతా ఉందని కొందరు, భవిష్యత్తనేది లేదని కొందరు, వర్తమానం భవిష్యత్తుకు దారితీస్తుందని కొందరు, మూడు కాలాలు సహజమని మరి కొందరు వ్యక్తం చేసారు.

'వర్తమాన భవిష్యత్తులు అవిభాజ్యాలని, వర్తమానంలోని వైరుధ్యాల ఘర్షణ నుంచి భవిష్యత్తు పుడుతుందని వర్తమాన సామాజిక క్రమ పరిణామాన్ని దాని అంతర్భాగంగా ఆకళించుకున్నప్పుడు భవిష్యత్ సాహిత్యాన్ని ఊహించగలం.' [1]

---

1. పాపినేని శివశంకర్, సాహిత్యం మౌలిక భావనలు, పాపినేని ప్రచురణలు, గుంటూరు, 1996, పుట 166.